ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

గురువులకు వందనం!



చిన్ననాట గురువులు విద్యార్థుల ఆలోచనల్లో నాటిన విత్తనం.. చదువులోనే కాదు వ్యక్తి వికాసంలోనూ కీలకంగా మారుతుంది. అందుకే ఏ స్థాయికి ఎదిగినా గురువులను తలచుకుంటారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తనకు దారి చూపిన గురువులను ఇలా గుర్తు చేసుకుంటూ నమస్కరించుకుంటున్నారు.

● చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు

"నేను చదువుకునేటప్పుడు కథలు చెప్పి నీతి అడిగేవారు. తప్పు, ఒప్పుల గురించి వివరించేవారు. ఇప్పుడు చిన్నపిల్లలకు ఫోన్లు ఇచ్చేస్తున్నారు. విలువలు తెలియడం లేదు. అందుకే 14 ఏళ్ల పిల్లలు ఇంట్లో నుంచి ప్రేమ పేరుతో వెళ్లిపోతున్నారు. తల్లిదండ్రుల మీదా తిరగబడుతున్నారు. ఇప్పుడు టీచర్ల మీదే ఎక్కువ బాధ్యత ఉంది."



ఏ స్థాయికి ఎదిగినా చిన్ననాటి నుంచీ గురువులు

ప్రతి విద్యార్థి జీవితంలోనూ గురువులు ఉంటారు. వారిలో కొందరే మన మీద ముద్ర వేస్తారు. ఆదర్శంగా నిలుస్తారు. మనం ఎదిగేందుకు కారణమవుతారు. గురువులంటే స్కూల్‌లో, కాలేజీలో చదువు చెప్పినవారే కాకుండా బయట కూడా చాలామంది మనల్ని ప్రభావితం చేస్తారు. మనకు అండగా నిలిచి మన ఉన్నతికి కారణమవుతారు. వారు కూడా గురువులే. జీవితంలో తొలి గురువులు తల్లిదండ్రులే. గురుపూజోత్సవం సందర్భంగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు.. తన జీవితంలో కీలక పాత్ర పోషించిన, ఆదర్శంగా నిలిచిన గురువుల గురించి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా పంచుకున్నారు.

తొలి గురువులు అమ్మా నాన్నా

మా అమ్మ శారదాదేవి నాలుగో తరగతి, నాన్న మంగాచారి ఆరో తరగతి వరకే చదువుకున్నారు. వారిద్దరూ చదువుకోకపోయినా ప్రతి రోజూ నన్ను చదువుకోమని చెప్పేవారు. వారే నాకు తొలి గురువులు. ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఎంసెట్‌కు దరఖాస్తు చేసేందుకు డబ్బుల్లేవు. అప్పుడు మా అమ్మ ఇంట్లోని గిన్నెలు అమ్మేసి డబ్బులు ఇచ్చింది. మిషన్ కుట్టి నా చదువుకు అమ్మ డబ్బులిచ్చేది. ఇప్పటికీ మా ఇంట్లో అమ్మ వద్ద కుట్టు మిషన్ అలాగే ఉంది.

స్కూల్‌లో తెలుగు టీచర్

మార్టూరులోని రాయల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పది వరకు తెలుగు చెప్పిన టీచర్ భవానీ మేడమ్ అంటే నాకు చాలా గౌరవం. ఆమె ప్రతిభ, పిల్లల్ని అర్థం చేసుకోవడం నాకు నచ్చుతాయి. స్కూల్లో పిల్లలకు పాఠాలు అర్థం కాకుంటే మళ్లీ స్టడీ అవర్ నిర్వహించి పాఠాలు చెప్పేవారు.

ఇంటర్‌లో రామకృష్ణ సార్

నాకు ఎప్పటికీ గుర్తుండే టీచర్ రామకృష్ణ సార్. ప్రస్తుత బాపట్ల జిల్లా మార్టూరులోని రాయల్ జూనియర్ కాలేజీలో ఆయన నాకు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్ టీచర్. ఆయన వేసిన ఇంప్రెషన్ నాలో ఇప్పటికీ ఉంది. ఆయన బోధించే విధానం చాలా బావుంటుంది. విద్యార్థి స్థాయి కనుక్కుని, వారికి అర్థమయ్యేలా బోధించేవారు రామకృష్ణ సార్. టాప్‌లో కొంతమంది, బాటమ్‌లో మరికొంతమంది విద్యార్థులుంటారు. వారిని విభజించి చదువు చెప్పాలి. రామకృష్ణ సార్ అక్కడే చదువు చెప్పారు.

మోటివేట్ చేసిన శ్రీధర్‌బాబు

చిన్న ఉద్యోగం చేసుకుటూ చదువుకునేవాడిని. ఓ రోజు లైబ్రరీలో అద్దంకి శ్రీధర్‌బాబు గారి ఇంటర్వ్యూ చదివాను. బాగా మోటివేట్ అయ్యాను. నాలో కాన్ఫిడెన్స్ పెరిగి ఒక్కో పరీక్ష దాటుకుంటూ వచ్చాను. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన శ్రీధర్‌బాబు ప్రస్తుత గుంటూరు టొబాకో బోర్డు డైరెక్టరుగా ఉన్నారు. నా మనసులో ఆయనది గురు స్థానమే.

ట్రైనింగ్‌లో వంశీప్రియ అక్క

హైదరాబాదులో నేను ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా ఎంపికై ట్రైనింగ్ అయ్యేటప్పుడు నా బ్యాచ్‌మేట్ వంశీప్రియ నాకు అక్కలా ఉండేది. మంచీ చెడ్డా చెబుతూ ఎప్పటికప్పుడు నన్ను మోటివేట్ చేసేది. ఆమె నాకు గురువులాంటిదే.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు పురస్కారం

చిత్తూరు (సెంట్రల్): జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 60 మందికి టీచర్స్ డే సందర్భంగా గురువారం పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా చిత్తూరులో విద్యాశాఖ, సమగ్ర శిక్షసంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే గురుపూజోత్సవంలో వీరిని సన్మానించనున్నారు. జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికిఅన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజాప్రతినిధులు,అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నారు.

ఒకరు సైన్సు పోటీలో నమూనాలను అంతర్జాతీయ ప్రదర్శనకు తీసుకువెళ్లేలా కృషి చేశారు. ఇంకొకరు సైన్సు ప్రదర్శనలో విద్యార్థులను 'ఇన్‌స్పైర్' చేశారు. మరొకరు పాఠ్యపుస్తకాల కల్పనలో భాగస్వామిగా.. అర్థమయ్యే రీతిలో రచన చేసేలా దోహదపడ్డారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంచడానికి వీరు చేసిన కృషిని, వారి మాటల్లోనే తెలుసుకుందాం.

- చిత్తూరు (సెంట్రల్)



సైన్సు ప్రయోగంపై విద్యార్థికి శిక్షణ ఇస్తున్న జిల్లా అధికారి రమణ

'సకుర' పోటీల్లో మన నమూనాలు



గతేడాది రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనలో జిల్లా నమూనాలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ముర్ము

అంతర్జాతీయ స్థాయిలో జపాన్ దేశం సకురలో జరిగిన సైన్సు పోటీల్లో మన జిల్లా నుంచి రెండు నమూనాలు ప్రదర్శితమయ్యాయి. టూ వీలర్ బ్యాక్ రెస్ట్ ఫర్ సైట్ సీట్ ఉమెన్.. పది నుంచి 15 రోజులపాటు కూరగాయలు తాజాగా ఉండేలా 'గార్లిక్ బ్యాగ్' నమూనాలవి. వీటి పేటెంట్ హక్కులను జపాన్ ప్రభుత్వం తీసుకుంది. గతేడాది ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఇన్‌స్పైర్ ప్రదర్శనలో మన జిల్లా విద్యార్థుల నమూనాలకు బహుమతులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ పోటీల్లో జిల్లా నుంచి అత్యధిక నామినేషన్లు చేయించి దేశంలోనే జిల్లాను 10 స్థానాల్లోపు ఒకటిగా నిలబెట్టడం జిల్లా సైన్స్ అధికారిగా సంతృప్తి నిస్తోంది. 'ప్రధానమంత్రి పే చర్చా' కార్యక్రమంలో పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యార్థులను నేరుగా ప్రధాని మోదీతో మాట్లాడించేలా ప్రోత్సహించాను. రీజనల్, రాష్ట్ర స్థాయి సైన్సు పోటీల్లోనూ విద్యార్థులు పాల్గొనేలా చేయడం నాకు సంతృప్తి నిచ్చింది.

- ఆర్‌వీ రమణ, జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థులతో స్నేహితుడిగా...



ఉపాధ్యాయుడిగా కాకుండా విద్యార్థులతో స్నేహితుడిగా మెలిగినప్పుడే వారిలోని ప్రతిభను వెలికి తీయగలం. గత రెండు సంవత్సరాలుగా అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్ ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొనేలా చేశాను. బహుమతులు తెచ్చి పెట్టేలా వారితో నమూనాలు చేయించాను. 2021 రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో మా పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. గత 22 సంవత్సరాలు నా సొంత డబ్బులతో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నా. ప్రత్యేక దినాల్లో విద్యార్థులకు స్పెషల్ వంటకాలు చేయించి వడ్డించే వాడిని. సేవా కార్యక్రమాలు చేయడం, పేద విద్యార్థులకు సాయం చేయడం, వారిని మంచి మార్గంలో నడిపించడం అనేది టీచరుగా ఉన్నందుకే సాధ్యపడింది. అందుకే నేను టీచర్‌నని సగర్వంగా చెప్పుకోగలుగుతున్నా.

- తులసీరాము, ఫిజికల్ సైన్స్ టీచర్, జడ్పీహెచ్‌ఎస్, కీలపట్ల, గంగవరం మండలం



2022లో ఎడ్యుకేషన్ ఎఫిషనీ పురస్కారం అందుకుంటున్న షంషేర్ ఖాన్

రచనలతో విద్యార్థులను ఆకర్షింప చేయాలి

బోధనతోనే కాకుండా రచనలతోనూ విద్యార్థులను ఆకర్షింప చేయాలి. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సరళమైన రీతిలో పాఠ్యపుస్తకాలను అనువదించడం, రచన చేయడం నాకు సంతృప్తి నిస్తోంది. భౌతిక, రసాయన శాస్త్రాల పాఠ్యపుస్తకాలను, ఓపెన్ స్కూల్ సైన్స్ పాఠ్యపుస్తకాలను రచన చేశాను. తొమ్మిదవ తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్యపుస్తకాన్ని రచన చేయడంలో భాగస్వామిని అయ్యా. ఉపాధ్యాయ కరదీపి రచనలు చేశాను. విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు, క్విజ్ పోటీలకు ప్రోత్సహించడం, తిరుపతి రేడియో కేంద్రం ద్వారా నాతో పాటు విద్యార్థుల ప్రసంగాలు, కవితలు చదివించడం ఆనందంగా ఉంది. ఎన్నో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందా. ప్రయోగాలు చేయించడంలో గైడ్ టీచర్‌గా విద్యార్థుల్లోని నైపుణ్యం వెలికి తీయడం నా అదృష్టంగా భావిస్తున్నా.

- జీకే షంషేర్ ఖాన్, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్‌ఎస్, టేకుమంద, బంగారుపాళ్యం మండలం



వి.కోటలో సంఘీభావ ర్యాలీ

సంఘ విద్రోహ శక్తులపై పీడీ యాక్టు

● శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ హెచ్చరిక

● ఇకపై ఇలాంటివి జరగకుండా బాధ్యత తీసుకుంటామన్న సభ్యులు

వి.కోట, సెప్టెంబరు 4: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘ విద్రోహశక్తులపై పీడీ యాక్టు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. వి.కోటలో బుధవారం హిందూ, ముస్లిం పెద్దలతో ఏర్పాటైన శాంతి కమిటీ సమావేశమైంది. రెండు మతాలకు చెందిన కొందరు సొంత ప్రయోజనాల కోసం ప్రేరేపించడం వల్ల అల్లర్లు జరిగినట్లు సభ్యులందరూ ఏకీభవించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఘర్షణలకు కారకులైన ఆరీఫ్, అతడి కుటుంబ సభ్యులు.. రామచంద్ర ప్రవర్తనను సభ్యులు ఖండించారు. ఆరీఫ్ కుటుంబీకులు తమ ప్రవర్తన మార్చుకోకుంటే మసీదుల నుంచి బహిష్కరించమని కలెక్టర్ కోరారు. రామచంద్ర విషపూరిత మాటలు హిందూ యువకులు వినకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. వీరు హిందూ, ముస్లింల ఐక్యతకు, మత స్వేచ్ఛకు మచ్చ తీసుకొస్తున్నారని ప్రజలు గుర్తించాలన్నారు. సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి వి.కోట సర్పంచి, ఆమె కుమారుడు పీఎన్ నాగరాజ్ అండగా ఉన్నారని గుర్తించామని సభ్యులు చెప్పారు. దీంతో సర్పంచ్ చెక్ పవర్‌ను తొలగిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఘర్షణలో ఆస్తి నష్టం జరిగిన వారికి త్వరగా నష్ట సరిహారం అందేలా చూస్తామన్నారు. వినాయక చవితి వేడుకలు యథావిధిగా జరుగుతాయని, హిందూ, ముస్లింలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఎస్పీ సూచించారు. ఆరు నెలలపాటు అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.



శాంతి కమిటీ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ

22 మందితో శాంతి కమిటీ

హిందూ, ముస్లిం పెద్దలు 22 మందితో శాంతి కమిటీని ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు పార్వతి తెలిపారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, వైసీపీ కన్వీనర్ బాలగురునాథ్, మాజీ సర్పంచి సుబ్రమణ్యం, నియోజక వర్గ బీజేపీ అధ్యక్షుడు విజయ్, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సీతారామయ్య, దుర్గామాత కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సుప్రభాత్ సీఈవో ఉదయసాగర్‌రెడ్డి, ఆయిమాతా ఆలయ కార్యదర్శి లాబూరాం, రాగశ్రీ పాఠశాల కరస్పాండెంట్ రఘుపతి ఉన్నారు. ● మరో వర్గం నుంచి మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, మండల అధ్యక్షుడు రుహుల్లా, జామియా మసీదు ముత్తువలి అబ్దుల్ సలాంసాహెబ్, చౌక్ మసీద్ ముత్తువలీ మహమ్మద్ బాషా, ఖాజీపేట ముత్తువలి లతీఫ్, అడ్వకేట్ నవాజ్, వైస్ సర్పంచ్ అక్మల్‌బాషా, జహీర్ మౌలానా, హెసానుల్లా, అఖీల్ అహమ్మద్, జాకీర్, గౌస్‌పీర్ ఉన్నారు.

అఖిలపక్షం సంఘీభావ ర్యాలీ : ఎంపీడీవో కార్యాలయం నుంచి లాంగ్ బజారు మీదుగా అఖిలపక్షం నేతలు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉన్న వారి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఘర్షణలకు, దాడులకు తెగబడటం సరికాదన్నారు. హిందూ, ముస్లిం బాయీ బాయి అంటూ నినదించారు.

144 సెక్షన్ సడలింపు : రెండో రోజైన బుధవారం వి.కోటలో 144 సెక్షన్‌ను పాక్షికంగా సడలించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కూరగాయలు, పూలు, పండ్ల దుకాణాలతో పాటు ఇతర చిరు దుకాణాల నిర్వహణకు అనుమతిచామన్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరచుకున్నాయన్నారు. మరికొన్ని దుకాణాలకు, హోటళ్లకు గురువారం అనుమతి ఇస్తామన్నారు. అన్ని చోట్ల సాక్ష్యాలు సేకరిస్తున్నామని, పూర్తి స్థాయిలో విచారించాక బాధ్యతలపై చర్యలు ఉంటాయని ఎస్పీ మణికంఠ అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై గ్రామ బహిష్కరణ విధిస్తామని హెచ్చరించారు. కాగా, బుధవారం కూడా పోలీసు బందోబస్తు కొనసాగింది.

విషాదాంతం

● ముగ్గురి ప్రాణాలను బలిగొన్న వివాహేతర సంబంధం

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 4: వివాహితులైన ఇద్దరి మధ్య ఏర్పడిన వివాహేతర సంబంధం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. విషాదాంతంగా మారింది. వివాహేతర సంబంధం కలిగిన రామచంద్ర, శోభ బుధవారం ఆత్మహత్యకు పాల్పడగా.. తన కుమారుడి వ్యవహారం తెలిసి మంగళవారమే సల్లాపురెమ్మ బలవన్మరణం చెందారు. రామకుప్పం, శాంతిపురం మండలాల్లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శాంతిపురం మండలం శిలామాకులరాయికి చెందిన రామచంద్రకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇతడు కొన్నేళ్ల కిందట బెంగళూరులో స్థిరపడ్డారు. అక్కడ టిప్పరు నడుపుతూ.. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని నెలల కిందట హిందూపురానికి చెందిన గిరీష్.. ఇతడి వద్ద డ్రైవరుగా చేరాడు. అతడికీ భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి రెండు కుటుంబాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో గిరీష్ భార్య శోభతో రామచంద్రకు చనువు పెరిగి అది కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట వీరిద్దరూ కనిపించకుండా పోయారు. తన భర్త కనబడటం లేదంటూ గతనెల 24న రామచంద్ర భార్య బెంగళూరులో.. తన భార్య కనబడుట లేదని 26వ తేదీన గిరీష్ హిందూపురంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం రామచంద్ర, శోభ రామకుప్పం మండలం చెలిమిచేను అటవీ ప్రాంతంలోని కాజీవే సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉండగా పశువుల కాపరులు గుర్తించి, గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వీరిని స్థానికులు 108 వాహనంలో కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వీరు మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామచంద్ర, శోభ పురుగుల మందు తాగి ఉంటారని, సంఘటన స్థలం వద్ద వారు వాంతులు చేసుకున్న ఆనవాళ్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ నరేష్ తెలిపారు.



శోభ, రామచంద్ర మృతదేహాలు





సల్లాపురెమ్మ (ఫైల్ ఫొటో)

రెండు రోజుల కిందటే రామచంద్ర తల్లి ఆత్మహత్య

తన కుమారుడు రామచంద్రకు వివాహేతర సంబంధం ఉందన్న విషయం తెలిసి సల్లాపురెమ్మ మనస్తాపంతో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారం రోజుల కిందట శోభతో కలిసి రామచంద్ర శిలామాకులరాయిలోని తన ఇంటికి వచ్చాడు. దీనిపై ఆమె కుమారుడిని తీవ్రస్థాయిలో మందలించింది. గుండెజబ్బుతో బాధపడుతున్న ఆమె సోమవారం ఆస్పత్రికి వెళ్లారు. ఆపరేషన్ చేయాలని అక్కడి వైద్యులు తెలిపారు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు కుమారుడి వైఖరి జీర్ణించుకోలేని ఆమె మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం ఆమె అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా, రామచంద్ర, శోభ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

మెడికల్ షాపు యజమానిపై అత్యాచారం కేసు

తిరుపతి(నేర విభాగం), సెప్టెంబర్ 4 : ఓ మెడికల్ షాపు యజమాని అత్యాచారానికి పాల్పడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు...తిరుపతి రూరల్ మండలంలో కుప్పుస్వామి హిమ మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఆస్మాతో బాధపడుతోన్న ఓ కార్మికుడి కుమార్తె (10) బుధవారం సాయంత్రం మెడికల్ షాపులో నెబులైజర్ పెట్టుకుని మందులు తీసుకు వెళ్లేందుకు వచ్చింది.వైద్యం పేరుతో ఆమెను లోపలికి పిలిచిన కుప్పుస్వామి మాయ మాటలతో నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయపడిపోయిన ఆ బాలిక జరిగిన విషయాన్ని తన తండ్రికి తెలియజేసింది.ఆగ్రహంతో మెడికల్ షాపు వద్దకు చేరుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ముద్దాయిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చిన్నగోవిందు చెప్పార

ప్రశాంతంగా 'చవితి' వేడుకలు

వి.కోట, సెప్టెంబరు 4: జిల్లా వ్యాప్తంగా సహృద్భావ వాతావరణంలో, ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం తెలిపారు. వి.కోటలో జరిగిన ఘటన నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఆనందదాయకంగా వేడుకలు జరిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వేడుకలకు అందరూ సహకరించాలన్నారు.

7న స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందుబాటులో వుంటాయని, ఈ విషయంలో అందరూ సహకరించాలని ఆయన కోరారు.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4: జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 14 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పంలో 32.6, అత్యల్పంగా పెద్దపంజాణిలో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది. విజయపురంలో 27.8, నింద్ర 22.2, కార్వేటినగరం 21.2, ఐరాల 17.2, నగరి 16.2, గంగవరం 12.4, పలమనేరు 10.8, సదుం 10.2, పుంగనూరు 7.2, పెనుమూరు 6.6, శ్రీరంగరాజపురం 6.6, పూతలపట్టులో 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు పాల్గొనే ఈ సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.15 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,15,81,533 వచ్చింది. ఆస్థాన మండపంలో ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 49 గ్రాముల బంగారు, 1.30 కేజీల వెండి, 602 యూఎస్ఏ, 20 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7,940, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.24,025 సమకూరాయి. ఈ ఆదాయం పూర్తిగా 18 రోజులలో లభించింది.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

19 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 4: సత్యవేడు అటవీ ప్రాంతంలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం సత్యవేడు సమీపంలో బీరకుప్పం సెక్షన్ ఎస్‌కే మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారు. బుధవారం ఉదయం భూపతేశ్వర కోన వద్ద స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు కింద పడేసి పారిపోయారు. అయితే పోలీసులు ఇద్దరిని పట్టుకోగలిగారు. వారు నాగలాపురానికి చెందిన వ్యక్తులుగా గుర్తించి, తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో అదనపు ట్రిప్పులు తిప్పుతాం



అదనపుఈవో వెంకయ్య చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 4: త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్సుల ద్వారా అదనపు ట్రిప్పులు తిప్పుతామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వివరించారు. బుధవారం ఆయన తిరుమలలో అదనపుఈవోను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువకప్పి సత్కరించారు. అనంతరం చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కనుమదారిలో మొత్తం 410 బస్సులు నడుపుతున్నామని, రోజుకు దాదాపు 1500 ట్రిప్పులు తిరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అదే బస్సుల సంఖ్యతో అదనంగా 500 ట్రిప్పులు తిరిగేలా చర్యలు చేపట్టామన్నారు. గరుడ సేవకు 3వేల ట్రిప్పులు తిరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదనపు సిబ్బందిని కూడా రప్పిస్తున్నామన్నారు. గతంలో మాదిరిగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. అదనపు ఈవో స్పందిస్తూ.. పోలీసు, విజిలెన్స్ విభాగాలతో సమన్వయం చేసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథం కూడా పాల్గొన్నారు.

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్నియేటివ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్, సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, సెప్టెంబరు 4: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్నియేటివ్ అవార్డు దక్కించు కుంది. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో జియాంగ్గీ బిజినెస్ సెంటర్ డైరెక్టర్ జాంటీ జంగ్, కంబోడియా కాన్సులేట్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, యూసి దారివాల్ చేతుల మీదుగా జాతీయ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డును అమరరాజా ఫౌండేషన్ సభ్యులు అందు కున్నారు. యువతలో నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు ఈ లభించినట్లు ప్రకటించారు.

విజిలెన్సు ఎస్పీగా కరీముల్లా షరీఫ్



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: తిరుపతి విజిలెన్సు ఎస్పీగా విజయవాడలో పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలో ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన కరీముల్లా షరీఫ్ అనంతపురం జిల్లా కదిరి డీఎస్పీగా పని చేశాక గ్రేహౌండ్స్‌కు బదిలీ అయ్యారు.తర్వాత కడప జిల్లా మైదుకూరు,అనంతపురం జిల్లా పెనుకొండల్లో డీఎస్పీగా పనిచేసిన ఆయన సీబీడీకి బదిలీ అయ్యారు.2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసింది. అనంతరం పశ్చిమ గోదావరి సెబ్ అదనపు ఎస్పీగా నియమించింది. తరువాత విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసారు. 2023లో ఎస్పీగా పదోన్నతిపై విజయవాడలోని విజిలెన్సు విభాగంలో ఎనిమిది నెలలు పనిచేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలోని వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు ఆయన్ను విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో ప్రస్తుతం తిరుపతి విజిలెన్సు విభాగానికి ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విజిలెన్సు ఎస్పీల బదిలీల్లో కరీముల్లా షరీఫ్‌ను తిరుపతి ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

సులువుగా రైతు సేవలు

ఆన్‌లైన్ దిశగా సింగిల్ విండోలు - పైలట్ ప్రాజెక్టు కింద ఈసీపల్లె, నగరి సొసైటీల ఎంపిక



ఎర్రచెరువుపల్లి సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ సరంజామా - నగరి సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ సరంజామా

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4: రైతులు పరస్పర సహకారంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటివరకు మాన్యువల్ సేవలు అందించిన సంఘాలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో రైతులకు సకాలంలో సేవలు అందించకపోవడం, రాయితీలు పక్కదారి పట్టడం, ఎరువులు తదితర వ్యవసాయ ఉత్పత్తులు సకాలంలో అందకపోవడం వంటి లోపాలు వెలుగుచూశాయి. వీటిని అధిగమించేందుకు డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నాబార్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65 మండలాల్లో 75 సింగిల్ విండోలు ఉండగా, వీటిలో ఎర్రచెరువుపల్లి (పూతలపట్టు మండలం), నగరి సంఘాలను పైలట్ ప్రాజెక్టుగా డిజిటలైజేషన్ పనులు ప్రారంభించారు. ఇవి తుది దశకు చేరుకున్నాయి.

● ప్రయోజనాలివీ..

సింగిల్ విండోల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ కంప్యూటరైజ్డ్ పాసుబుక్ అందిస్తారు. అందులో వారు తీసుకున్న రుణ వివరాలు, చెల్లించాల్సిన సొమ్ము, వడ్డీ వివరాలు ఉంటాయి. భూముల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో నేరుగా ప్రభుత్వం అందించే రాయితీలు, సబ్సిడీ ఖాతాల్లోకి జమ అవుతాయి.

● ప్రత్యేక నిధులు వెచ్చించి...

జిల్లాలోని 75సింగిల్ విండోల ద్వారా నాలుగు లక్షల మంది రైతులు సభ్యులుగా ఉండగా, సుమారు లక్ష మంది సేవలు పొందుతున్నారు. వారి వివరాలను పూర్తిగా కంప్యూటరీకరించడంతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు అనుసంధానం చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన సామగ్రి ఇప్పటికే అందించారు. నాబార్డు అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. రికార్డులు మొత్తం ఐదు దశల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు.

సేవలు విస్తృతం



సింగిల్ విండోల్లో రికార్డుల కంప్యూటరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తద్వారా రైతులకు త్వరితగతిన సేవలు అందించే అవకాశముంది. వీటితో పాటు సాధారణ బ్యాంకు సేవలను సైతం అందించే వీలుంటుంది.

- మనోహర్ గౌడ్, సీఈవో, డీసీసీబీ, చిత్తూరు

రోగులను అనవసరంగా రెఫర్ చేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పుంగనూరు, సెప్టెంబరు 4: పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. రోగులను అనవసరంగా రెఫర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. నూతనంగా నిర్మాణాలు జరుగుతున్న వైద్యశాల భవనాలను పరిశీలించారు. రోగులను సేవలు గురించి ప్రశ్నించారు. పుంగనూరులో పని చేయాల్సిన డాక్టర్ పద్మాంజలి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పని చేయడం ఏమిటని ఆరా తీశారు. అన్నమయ్యజిల్లాలో పని చేస్తూ చిత్తూరు జిల్లాలో జీతం ఎలా ఇస్తారని డీసీహెచ్ఎస్‌ను ప్రశ్నించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకుంటున్న రోగులను పరామర్శించి పరీక్షలు ఎలా చేస్తున్నారని అడిగారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఇక్కడ వైద్యం చేయకుండా ఇతర ప్రాంతాలకు అనవసరంగా రెఫర్ చేయరాదని, అవసరమైన మందులు నిల్వ వుండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కొన్ని సమస్యలు ఉన్నాయని, త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీగా ఉన్న డాక్టరు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. అవసరమైన పరికరాలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. చాలా కాలంగా సిబ్బంది ఇక్కడే ఉండటంతో సరిగా పని చేయడం లేదని, వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని టీడీపీ నాయకులు బి.వెంకటముని యాదవ్, సుహేల్‌బాషా కోరారు. తమకు 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ ఖర్చులకూ ఇబ్బందిగా ఉందని పారిశుధ్య కార్మికులు తెలిపారు. కలెక్టరు వెంట మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌పై టీటీడీ దృష్టి

- సందర్శించిన ఈవో, జేఈవోలు
- అంతా బాగుందంటూ వైద్యుల వివరణ
- మరి మీడియాలో కథనాలేంటన్న ఈవో



చిన్నారి పేషెంట్ తల్లితో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)పై టీటీడీ అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో గౌతమి, మరో జేఈవో, బర్డ్ ఇంచార్జి డైరెక్టర్ వీరబ్రహ్మం బర్డ్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి వైద్యులతో సమీక్షించారు. అయితే 'బర్డ్‌లో అంతా బాగా జరుగుతోంది' అని వైద్యులు ఈవోను పక్కదారిపట్టించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. దీంతో ఈవో స్పందిస్తూ ' అంతా బాగుంటే మీడియాలో వారానికో కథనం ఎందుకు వస్తోంది' అని ప్రశ్నించినట్టు సమాచారం. గడిచిన ఐదేళ్లలో బర్డ్ ఆస్పత్రి పాలన పక్కదారిపట్టిందని బుధవారం ఆంధ్రజ్యోతిలో 'గతి తప్పిన బర్డ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. అదేవిధంగా రెండు వారాల క్రితం బర్డ్‌లో అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్న నేపథ్యంలో 'బర్డ్‌ను భ్రష్టు పట్టించారు' అని మరో కథనాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో, జేఈవోలు బర్డ్‌ను పరిశీలించారు. పత్రికలో వచ్చిన ప్రతి అంశంపై వైద్యులు వివరణ రాసి ఈవోకు అందించినట్టు తెలుస్తోంది. వీటిపై తర్వాత విచారణ చేస్తానని ఈవో చెప్పినట్టు తెలుస్తోంది. బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలను, వైద్య సేవలను అడిగి ఈవో తెలుసుకున్నారు. అనంతరం అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్సరే, స్కానింగ్, ఓపీ వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అన్నప్రసాదాల నాణ్యత గురించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

● ఆపరేషన్లు తగ్గలేదు : టీటీడీ

బర్డ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు టీటీడీ సీపీఆర్వో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'గతి తప్పిన బర్డ్' కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రోగులకు ఓపీ, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల అమరిక వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు నెలల్లో 24,429 ఓపీ సేవలు, 1489 ఆర్థోపెడిక్ సేవలు అందించారని, 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారని వెల్లడించారు.గాయానికి కట్టు మార్చడం, కట్టు కట్టడాలు కూడా ఆపరేషన్ల కిందే చూపించి, ఈవోకు తప్పుడు సమాచారం ఇచ్చారన్న చర్చ వినిపిస్తోంది. అదేవిధంగా విజిలెన్స్ విచారణ పైన, సిబ్బంది నిర్లక్ష్యంపైన, మెడికల్ షాపు మూతపైన ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

సదరన్ డిస్కం నుంచి పాల్గొన్న65 బృందాలు - సీఎండీ కె.సంతోషరావు



విజయవాడ వాంబే కాలనీలో విద్యుత్ పనులు చేస్తున్న తిరుపతి రూరల్ డివిజన్ అధికారులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4: విజయవాడలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులకు సదరన్ డిస్కం నుంచి 65 బృందాలు వెళ్లాయని బుధవారం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి, సరఫరాను పునరుద్ధరించడానికి సదరన్ డిస్కం నుంచి 810 మంది సిబ్బందిని పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల ఆదేశాలమేరకు ప్రత్యేక బృందాలను పంపినట్లు చెప్పారు. వరదలు వచ్చిన మరుసటి రోజునుంచే తిరుపతి రూరల్ డివిజన్ నుంచి మూడు బృందాలు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైవున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను తమకు అప్పగించారని ఆయన తెలిపారు. గత మూడు రోజులుగా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. నగరంలో తాగునీటి సరఫరా, గృహాలకు విద్యుత్ సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యతగా పనులు జరుగుతున్నాయని సీఎండీ తెలిపారు. వాంబేకాలనీలో 20వేల గృహాలకు తిరుపతి రూరల్ డివిజన్ సిబ్బంది చేస్తున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను సీఎండీ పరిశీలించారు.

మంచి పౌరుల కొరత తీర్చేది ఉపాధ్యాయులే

గల్లా రామచంద్ర నాయుడు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 4: ఇపుడు దేశానికి మంచి పౌరుల కొరత తీవ్రంగా ఉందని, ఆ సమస్యకు పరిష్కారం ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా రామచంద్ర నాయుడు అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ నగర్‌లోని తన గురువు ఆచార్య కె.వెంకటరెడ్డిని సత్కరించిన తరువాత ఆయన మాట్లాడుతూ... ఆనాడు వెంకటరెడ్డి వంటి గొప్ప గురువులు ఉన్నందునే యువతలో నైపుణ్యాలు మెరుగుపడ్డాయని చెప్పారు. వారంతా దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. వెంకటరెడ్డి ఉపాధ్యాయ లోకానికి మార్గదర్శకుడని గుర్తుచేశారు. మాజీ మంత్రి, రచయిత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ... వెంకటరెడ్డి తన 93వ యేట ఇటీవలే స్వీయచరిత్ర ప్రచురించారని, వారు విద్యారంగానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని చెప్పారు. వారి రచనలో ఉపాధ్యాయవృత్తి ఔన్నత్యాన్ని చాటి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి కుటుంబసభ్యులు హేమలత, విజయ, సుమలత, రచయితలు సాకం నాగరాజ, వాకా ప్రసాద్, విద్యావేత్త జయరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు కట్టలేదని విద్యార్థుల గెంటివేత

● ప్రైవేటు పాఠశాల మెట్లపై తండ్రి నిరసన



బడి ముందు పిల్లలతో బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రభాకర్

పలమనేరు, సెప్టెంబరు 4: ఫీజు చెల్లించలేదని చిన్నపిల్లలను బడి నుంచి గెంటేసిన ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకుల తీరు పలమనేరులో సంచలనం సృష్టించింది. బడి నుంచి గెంటేసిన తన పిల్లలతో తండ్రి బడి మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. దీనిపై ఎంఈవోలు విచారించి డీఈవోకు నివేదిక పంపించారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పలమనేరు మండలం తవడపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ తన పిల్లలు యోధశ్రీ (1వతరగతి), విక్రమాదిత్య(ఎల్‌కేజీ)ను ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం ఫీజు చెల్లించేందుకు కొంత గడువు కోరగా, యాజమాన్యం తిరస్కరించింది. ఈనేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పాఠశాల యాజమాన్యం ప్రభాకర్‌కు ఫోను చేసి పిల్లలను తీసుకెళ్లాలని చెప్పారు. ఆయన వెళ్లే సరికే పిల్లలిద్దరూ ఎండలో పాఠశాల మెట్లపై కూర్చొని ఉన్నారు. ఫీజు చెల్లించేందుకు కొంత గడువు అడిగానని అప్పటికే చిన్నపిల్లలని ఎలా ఎండలో పంపించేస్తారని సిబ్బందిని ఆయన నిలదీశారు. వారి నుంచి సమాధానం లేకపోవడంతో పిల్లలతో కలిసి బడిముందు మెట్లపై బైఠాయించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వరల్ కావడంతో పాఠశాల హెచ్‌ఎంను ఎంఆర్‌సీ కార్యాలయానికి ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం పిలిపించారు. జరిగిన ఘటనపై ఇరువురి నుంచి విచారణ జరిపారు. ఫీజు చెల్లించనంత మాత్రాన ఇలా బడినుంచి పిల్లలను గెంటి వేయడం సరైన పనికాదని హెచ్‌ఎంకు సూచించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపుతున్నట్లు ఎంఈవోలు తెలిపారు.

సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.చంద్రగిరిలో పనిచేస్తున్న రామయ్యను ఎస్వీయూనివర్శిటీకి, ఇక్కడ పనిచేస్తున్న మురళీమోహన్‌ను తిరుమల టూటౌన్‌కు బదిలీ చేశారు.తిరుమల టూటౌన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను వీఆర్‌కు పంపారు. ఎన్నికల ముందు వీఆర్‌కు పంపిన అబ్బన్నను తిరుపతి క్రైం పోలీస్టేషన్ సీఐగా నియమించారు. వీరందరూ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనుండగా చంద్రగిరి సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేద్దాం

పోలీసు అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 4: రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలు పనిచేయాలని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని వీఐపీ ఛాంబర్‌లో బుధవారం లా అండ్ ఆర్డర్, బాంబుడిస్పోజల్ విభాగం, స్పెషల్ ఇంటెలిజన్స్ విభాగం, జీఆర్‌పీ, రైల్వే భద్రతా దళాల అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైల్వే ప్రయాణికుల పట్ల ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ విభాగాలు తీసుకుంటున్న చర్యలను ఐపీఎఫ్ అధికారి మధుసూదన్ వివరించారు. రైల్వే స్టేషన్లలో నష్టాలు జరుగకుండా అన్ని విభాగాలు సహకరించాలని కోరారు. అన్ని విభాగాల సహకారం ఉంటుందని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. అలాగే రైళ్లలో జరుగుతున్న నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రయాణికుల లగేజీలు, వస్తురవాణా విభాగాల్లపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రైల్వే విభాగానికి, భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే విధంగా తీవ్ర వాద సంస్థలనుంచి వస్తున్న సమాచారాలపై, తీసుకోవలసిన పటిష్ఠ భద్రతా చర్యలపై అధికారులు చర్చించారు. సమావేశంలో తిరుపతి డీసీఐవో ఐబీ అధికారి పి.శిరీష, డీఎస్పీలు, ఇతర శాఖల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 57,817 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 17,592 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో కిరణ్ అబ్బవరం



తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): సినీహీరో కిరణ్ అబ్బవరం దంపతులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల కిరణ్, రహస్యల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో శ్రీవారి ఆశీస్సుల కోసం ఈనూతన దపంతులు బుధవారం తిరుమలకు చేరుకుని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు హీరో కిరణ్ అబ్బవరం దంపతులను చూసేందుకు సినీ అభిమానులు ఆశక్తి చూపారు. కిరణ్ 'ఎస్ఆర్ కల్యాణమండపం', 'రాజావారు రాణివారు', 'రూల్స్ రంజన్' వంటి సినిమాల్లో నటించి మంచి పేరు పొందిన విషయం తెలిసిందే.

ద్రావిడ వర్సిటీలో త్వరలో ఆటోమేషన్



మాట్లాడుతున్న ఆచార్య దొరస్వామి

గుడుపల్లె, సెప్టెంబరు 4: ద్రావిడ యూనివర్సిటీలో త్వరలో ఆటోమేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఉపకులపతి ఆచార్య దొరస్వామి తెలిపారు. బుధవారం వర్సిటీలో ఆటోమేషన్ అధికార ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పరీక్షల విభాగం, విద్యార్థుల వసతి, ప్రవేశాల ప్రక్రియను ఆటోమేషన్ ద్వారా చేపడతామన్నారు. దీని వల్ల వాటి విషయంలో ఆర్థిక పరమైన దుర్వినియోగం అరికట్టడమే కాకుండా, విద్యార్థులకు మెరుగైన వసతులు ఒనగూరుతాయన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, వార్డెన్ ఆచార్య శ్రవణ్‌కుమార్, పరీక్షల డీన్ ఆచార్య అరవిందకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రాముఖ్యతపై ర్యాలీ

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 4 : మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత అధ్వర్యంలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాజా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని, రక్తహీనత రాకుండా తగిన ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈనెల 1వ తేది నుంచి జరుగుతున్న పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అన్ని పంచాయతీల్లో పౌష్టికాహారం గురించి గర్భిణు, బాలింతలు, బాలికలకు అవగాహన కల్పించనున్నట్లు సీడీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, లత, బీపీసీ ప్రదీప్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద సహాయ పనులకు వెళ్లిన మున్సిపల్ కార్మికులు

పలమనేరు, సెప్టెంబరు4 : జల దిగ్బంధంతో అల్లాడుతున్న విజయ వాడ ప్రజలకు సేవలందించేందుకు గాను పలమనేరు మున్సిపల్ సిబ్బంది, కార్మికులు అక్కడికి తరలి వెళ్లారు. మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి వారు ప్రత్యేక వాహనంలో ఇద్దరు శానిటరీ సెక్రటరీలు, నలుగురు శానిటరీ మేస్త్రీలు, 20 మంది పారిశుధ్య కార్మికులు వెళ్లారు. అధికారులు ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక వాహనంలో వారు పలమనేరు నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

పలమనేరు డిపో దుస్థితిని పట్టించుకోండి

పలమనేరు, సెప్టెంబరు4 : పలమనేరు డిపోలోని పలు సర్వీసులు రద్దు చేయడంతో పాటు పలు సర్వీసులను ఇతర డిపోలకు బదిలీ చేయడం వలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ ఆర్ఎం రాముకు పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. కొత్తబస్సులు కూడా పలమనేరు డిపోకు తెప్పించాలని, కాలం చెల్లిన బస్సుల కారణంగా బస్సుల్లో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఆర్ఎం రాము మాట్లాడుతూ త్వరలోనే పలమనేరు డిపోకు కొన్ని సర్వీసులు తెప్పించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త బస్సులు కూడా కేటాయించేందుకు తనవంతు కృషిచేస్తానని ఆర్ఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లె, నరసింహులు, కమిటి సభ్యులు విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, సుబ్రమణ్యం యాదవ్, నారాయణ, సాంబయ్య, శ్యామరాజ్, రెడ్డెప్ప, దొరస్వామి పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ నిధులు వినియోగించుకోండి

సోమల, సెప్టెంబరు 4: వాటర్‌షెడ్ పథకం కింద మంజూరైన నిధులను కమిటీ సభ్యులు వివిధ పనులకు కేటాయించి సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు పీవో శోభారాణి తెలిపారు. బుధవారం చిన్నఉప్పరపల్లె సచివాలయంలో కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో వివిధ పనులకు కోటి రూపాయలు మంజూరు చేయగా కేవలం రూ. 10లక్షలు వినియోగించారని, మిగిలిన రూ. 90లక్షలు ఈ ఏడాదిలో వ్యయం చేయాలన్నారు. పలువురు రైతులు పాల్గొని సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, పాడి రైతులకు గడ్డి కత్తరింపు యంత్రాలు, స్ప్రేయర్లు తదితర సామగ్రి అందజేయాలని వినతులు అందజేశారు. సమావేశంలో వాటర్‌షెడ్ చైర్ పర్సన్ పుష్పావతి, మాజీ ఎంపీటీసీ రమేశ్, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, జేఈ వెంకటముని పాల్గొన్నారు.

మూతపడిన ఆర్వో ప్లాంటు



సోమల, సెప్టెంబరు 4: ప్రజలకు శుద్ధినీరు అందజేసేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలో నాలుగు నెలలుగా ప్లాంటు పరికరాలు పాడైపోవడంతో మూతపడింది. అలాగే సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద ఆర్వో ప్లాంటు రెండు నెలలు గా మూత పడింది. స్థానిక ప్రజలు సచివాలయం, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో ప్రైవేటు ట్యాంకుల నుంచి శుద్ధినీటిని రూ.20 కొనుగోలు చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్లను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటి ప్రాణవాయువును కాపాడుకుందాం

శాంతిపురం, సెప్టెంబర్ 4 : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి ప్రాణవాయువును కాపాడుకోవాలని ఏపీడీ వెంకటరత్నం, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర, ఏపీవో హరి అన్నారు. బుధవారం కడపల్లె గురుకుల పాఠశాలలో వనం మనం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటారు వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పుష్ప, వైస్ చైర్మన్ నారాయణస్వామి, టిఎ హేమలత, ఎఫ్ఏ బాలకృష్ణ, నేతలు, దొరస్వామి, బీరేష్, చంద్ర, మంజునాథ్, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం



సదుం, సెప్టెంబరు 4: మండల పరిధిలోని చీకలచేను గ్రామ అటవీ శివారు ప్రాంతంలో నాటుసారా ఊటపై సదుం పోలీసులు బుధవారం దాడులు నిర్వహిం చారు. ఈ క్రమంలో 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ షేక్షావలి తెలిపారు. సారా తయారీదారులు పరార య్యారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

గంగవరం, సెప్టెంబరు 4 : మండలంలోని ప్రధాన రహదారుల్లో నిఘా ముమ్మరం చేయడంలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని మదనపల్లె-పలమనేరు రహదారి, బెంగళూరు - చెన్నై నేషనల్ హైవేలోని ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను అమర్చారు. రాత్రివేళ అనుమానితులు, అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిసినా తక్షణం పోలీసులకు సమాచారం అందిస్తే, సకాలంలో అక్కడకు చేరుకొని రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

ముగిసిన విరూపాక్షమ్మ, సత్యమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



కల్లూరు, సెప్టెంబర్ 4: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారి పల్లిలో బుధవారం గ్రామ దేవతలు విరూపాక్షమ్మ, సత్యమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ముగిశాయి. బుధవారం వేకువ జామున వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ విరూపాక్షమ్మ, సత్యమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. గ్రామానికి నాలుగు వైపులా ప్రతిష్ఠించిన శక్తిరాళ్లకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం, గంధమాభిషేకం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచెర్ల, సెప్టెంబరు4: ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 19వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష జనవరి 18వ తేది 2025 న ఉంటుందన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రొంపిచెర్ల, సెప్టెంబరు4: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో చెత్త తొలగింపు, తాగునీటి ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు అరికట్టుట, అక్రమ నీటి మోటార్లపై చర్యలు, పేడ దిబ్బలు తొలగింపు, మురుగు కాలువలు శుభ్రతపై వారికి సూచనలు ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చౌడేపల్లె, సెప్టెంబర్4: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అమినిగుంటలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ హాస్టల్ వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన జ్వరం, డెంగ్యూ, చికన్‌గూన్యా, టైఫాయిడ్, మలేరియ తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల నివారణ చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చౌడేపల్లె, సెప్టెంబర్4: 108 వాహనంలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ మోహన్‌బాబు ప్రకటనలో కోరారు. చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచర్ల, పులిచర్ల మండలాల్లో 108లో ఈఎంటీ ఉద్యోగాలకు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ నర్సింగ్, లైఫ్‌సైన్సెస్, జీఎన్ఎం, 5ఏళ్ల అనుభవం ఉన్న ఎంఎల్‌టీలు అర్హులన్నారు.

వీధికుక్కల పట్టివేత



పలమనేరు,సెప్టెంబరు4 : వీధికుక్కలను నియంత్రించేం దుకు బుధవారం పలమనేరులో వీధికుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టారు. తిరుపతి నుంచి వచ్చిన అనిమల్ కేర్ సిబ్బంది పలమనేరులోని మదనపల్లి రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, బోయవీధి, రెక్కమాను వీధి, ఎద్దులసంత వీధుల్లో వీధికుక్కలను బంధించారు. పట్టుబడిన కుక్కలను తిరుపతి అనిమల్ కేర్ సెంటరుకు తీసుకువెళ్లి అక్కడ వాటికి వ్యాక్సిన్లు వేసి, స్టెరిలైజేషన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గతనెల పలమనేరులో 31 వీధికుక్కలను తిరుపతి అనిమల్ కేర్ ల్యాండుకు తరలించి వ్యాక్సిన్లు వేసి, స్టెరిలైజేషన్ చేసి తిరిగి వాటిని బుధవారం ఇక్కడికి తీసుకొచ్చి వదిలి పెట్టారన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

పలమనేరు, సెప్టెంబరు4 : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు మండలంలోని ఉపాధ్యాయులకు బుధవారం స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆటల పోటీ లను మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం లు ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు వారు అభినందనలు తెలిపారు. ఈ పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం షంషీర్, పీఈటీలు అల్తాఫ్, ఆజామ్, అజయ్, షేక్‌సాజియా, కృష్ణవేణి తదితరులు నిర్వహించారు.

రొంపిచెర్ల : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని మార్కెట్‌యార్డు వద్ద బుధవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మండల విద్యాధికారులు ఇందిర, శ్రీనివాసులు పర్యవేక్షకులుగా ఉపాధ్యాయులకు వివిధ రకాల క్రీడా పోటీలు జరిగాయి. పరుగు పందేలు, త్రోబాలు, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు మహిళ, పురుష ఉపాధ్యాయులకు వేర్వేరుగా నిర్వహించారు.

పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి



పుంగనూరు, సెప్టెంబరు4: పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరులో పనిచేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కావడంతో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై పుంగనూరు కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి వచ్చినట్లు తెలిపారు.

పాముకాటుతో టైలర్ మృతి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు4: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చౌడేపల్లె మండలంలో చోటుచేసకుంది. గోసులకుర్రప్పల్లెకు చెందిన గురుస్వామి కుమారుడు చిన్న రెడ్డెప్ప(35) టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా పాము కాటు వేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే చౌడేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం నాటువైద్యం చేయించగా పరిస్థితి విషమించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నరెడ్డెప్ప మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి భార్య, పిల్లలు కలరు.

మెరుగైన విద్యాబోధనే టీచర్ల లక్ష్యంగా ఉండాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగవరం, సెప్టెంబరు4: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మెరుగైన విద్యాబోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం గంగవరం హైస్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యాంశాల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అందుతున్న బోధన, అందుబాటులో ఉన్న పుస్తకాలు, మధ్యాహ్న భోజనం లో నాణ్యత తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధానం ఇస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు పెద్దపీట వేస్తోందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను అందించి, విద్యాప్రమాణాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వార్డు సందర్శనలో వెల్లువెత్తిన అర్జీలు



కుప్పం 1వ వార్డులో కమిషనర్‌ను చుట్టుముట్టిన అర్జీదారులు

కుప్పం, సెప్టెంబరు 4: కుప్పం పురపాలక సంఘ అధికారులు బుధవారం చేపట్టిన వార్డు సందర్శన కార్యక్రమంలో ప్రజలనుంచి అర్జీలు వెల్లువెత్తాయి. ఇప్పటికే కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతి బుధవారమూ, కడా పీడీ వికాస్ మర్మత్ ప్రతి సోమవారమూ కుప్పం మండల సచివాలయంలో కొలువుదీరి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నారు. ఆయా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని ఎవరి స్థాయిలో వారు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం వార్డు స్థాయికి విస్తరించింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు బుధవారంనుంచి వార్డు సందర్శన కార్యక్రమాలు చేపట్టారు. రోజుకో వార్డు చొప్పున, మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 25 వార్డుల్లో అక్టోబరు నెల 8వ తేదీదాకా విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి, అక్కడికక్కడే పరిష్కారాలు చూపడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బుధవారంనాడు 1వ వార్డు పరిధిలోని సామగుట్టపల్లె, తంజమ్మ కొట్టాలు, బండశెట్టిపల్లెల్లో ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పర్యటించారు. స్థానికులనుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలు, సంక్షేమ పథకాలు అందకపోవడం, ఇప్పటికే అందుతున్న పథకాలు ఆగిపోవడం వంటి సమస్యలపై ప్రజలనుంచి మొత్తం 207 వినతులు అధికారులకు అందాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించి, ఆయా సమస్యల గురించి, అందుకు చేపట్టాలనుకుంటున్న పరిష్కారం గురించి ప్రజలకు వివరించారు. స్వీకరించిన వినతులకు రశీదులు ఇచ్చారు. వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, నాయకులు సత్యేంద్రశేఖర్, పి.గోపీనాథ్, జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, మున్సిప్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి స్టేడియాన్ని పరిశీలించిన కుప్పం టీడీపీ నేతలు



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 4: తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలోని క్రీడా ప్రాంగణంతోపాటు, అక్కడి స్పోర్ట్స్ స్టేడియాన్ని కుప్పం టీడీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని అధునాతన వసతులతో అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించేందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కృష్ణగిరి స్టేడియాన్ని సందర్శించారు. అక్కడి క్రీడా మైదానం, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియం, స్విమ్మింగ్ ఏరియా తదితరాలను పరిశీలించి క్రీడాకారులకు అక్కడ లభిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేయడానికి సుముఖంగా ఉన్నారని చెప్పారు. అయితే క్రీడాకారులను ప్రోత్సహించడానికి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన క్రీడా శిక్షణ స్థానిక యువతీయువకులకు ఇవ్వడానికి ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న విషయంలో ఒక అంచనాకు వచ్చేందుకే కృష్ణగిరి స్టేడియం సందర్శన చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, నాయకులు డాక్టర్ వెంకటేశ్, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, శాంతారాం, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ : టీడీపీ



ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

శాంతిపురం, సెప్టెంబర్ 4 : దేశానికే అన్నం పెట్టే అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. బుధవారం రాళ్ళబూదుగూరులోని ఆర్బీకే కేంద్రంలో ప్రభుత్వం రాయితీతో రైతులకు అందించే ఉలవలను పంపిణీ చేశారు. అనంతరం పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. తరువాత రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, టీడీపీ నేతలు చంద్రశేఖర్, మణి, నాగరాజు, నారాయణస్వామి, బాలు, ఎఎంసి నాగరాజు, శ్యామల, అనుసూయ, సుగునమ్మ, ఏవో అప్పోజి, వ్యవసాయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం పంచాయతీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉలవ విత్తనాలను 80 శాతం రాయితీతో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ రూ.870 విలువ కలిగిన 10 కిలోల నాణ్యమైన ఉలవ బస్తాను 80 శాతం రాయితీతో కేవలం రూ.174కే ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై శ్రద్ధ పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో అమృతవల్లి, ఏఏవో ఔరంగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం మిట్టపల్లె, బందార్లపల్లె రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ విత్తన ఉలువలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వ్యవసాయాధికారి అమృత, ఆర్ఎస్‌కే అధికారి ఆనంద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ధ్యేయం



ఉలవలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు4: రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుంగనూరు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం రాయితీతో అందజేసిన ఉలవ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో జ్యోతమ్మ, టీడీపీ నాయకులు సీవీ రెడ్డి, వెంకటరెడ్డి, గంగాధర్, మోహన్‌రెడ్డి, గంగరాజు, జనసేన నాయకులు విరూపాక్షి, శ్రీనివాసులు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలానికి 95 క్వింటాళ్ల ఉలయ విత్తనాలు వచ్చాయన్నారు. 10 కేజీల ఉలవ విత్తనాల ప్యాకెట్ ధర రూ: 174గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉలవలు కావలసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

సోమల : చిన్నఉప్పరపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం పలువురు రైతులకు రాయితీ ధరపై ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఏవీవీ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బుదవారం సబ్సిడీ ఉలవ విత్తనాలు పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా

రొంపిచెర్ల : మండలంలోని రైతులకు 80శాతం రాయతీలో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. బొమ్మగారిపల్లె సచివాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి అర్హత కల్గిన రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఆర్‌బికే సిబ్బంది, రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు ఓబులేశ్వర్‌రెడ్డి, దళిత నాయకులు ఈశ్వరయ్య, సహదేవ రైతులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

రామకుప్పం, సెప్టెంబరు 4: పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ కోరారు. బుధవారం రామకుప్పం పట్టణ శివార్లలోని గురుకుల విద్యాలయంలో వారు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని వృక్షాలుగా ఎదిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మెన్ సుబ్బయ్య, నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, నందారెడ్డి, బాలరాజు, సుబ్రీ, వెంకటరమణ, ఆదిల్, నవీన్, గిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి

శాంతిపురం, సెప్టెంబర్ 4 : పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా సర్పంచులు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు చొరవ చూపాలని ఎంపీడీవో కుమార్ అన్నారు. బుధవారం మండల సచివాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 6వ తేది నుంచి ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. మొదట విడతగా ఈ కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి 30వ తేది వరకు నిర్వహిస్తామన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయాలన్నదే సీఎం లక్ష్యం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, సెప్టెంబర్ 4 : కుప్పం నియోజకవర్గంలోని ప్రతి మహిళను లక్షాధికారులను చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. బుధవారం రాళ్ళబూదుగూరు జూనియర్ కళాశాల సమీపంలో కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సహకారంతో బెంగళూరు చెందిన ఈజీ మార్ట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో స్వయం ఉపాధిపై పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, నారాయణస్వామి, రుద్రప్ప, మునిరెడ్డి, బాలు, పివి నాగరాజు, బాలకృష్ణ, నాగరాజు, జయరాజ్, శ్యామల, అనుసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

చిత్తూరు, సెప్టెంబరు 4: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కోర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరు లారీ డ్రైవర్లకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కోర్ సంస్థ నిర్వాహకులు సద్దాం, రాజేశ్వరి, లక్ష్మి, భూపతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీపీఐ నాయకులు చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాలని కోరారు. అర్హులైన వారికి స్థలాలు మంజూరు చేసి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మణి, విజయగౌరి, జమిలాబీ, కవిత, రఘు, గజేంద్ర పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: నగరంలోని టీ చవటపల్లి యూపీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు, వ్యాక్సిన్ నిల్వలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. పుట్టిన బిడ్డలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డేకు నాలుగు అర్జీలు వస్తే రెండు అక్కడికక్కడే పరిష్కరించినట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్ డేను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

పాలసముద్రం, సెప్టెంబరు4: మండలం నుంచి తమిళనాడుకు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భారతి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు, ప్రభుత్వ భవనాలు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఇసుకను ఉపయోగించాలన్నారు. ఎక్కడబడితే అక్కడ నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కూలీలందరికీ పనులు కల్పించండి

పాలముద్రం, సెప్టెంబరు 4: ఉపాధి పథకం కింద జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు నిర్మించుకునే వారికి బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. ఏపీవో మార్గరేట్, ఈసీ అనూష, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చురుగ్గా పాళ్యంకొండ రోడ్డు పనులు

గుడిపాల, సెప్టెంబరు 4: మండలంలోని ఏఎల్‌పురం, నారగల్లు సమీపంలో వెలసిన పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయానికి రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు కి.మీ. రోడ్డు మార్గాన్ని హిటాచీ ద్వారా వెడల్పు చేసి, వాహనాల రాకపోకలకు అనువుగా చదును చేస్తున్నారు. బుధవారం ఆలయ చైర్మన్ గుర్రప్ప నాయుడు, కమిటీ సభ్యులు రాజు పనులను పర్యవేక్షించారు.

మొక్కలు నాటడం అలవాటుచేసుకోవాలి

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 4: విద్యార్థులు చిన్నతనం నుంచే మొక్కలు నాటడం నేర్చుకోవాలని డ్వామా పీడీ రాజశేఖర్ సూచించారు. వన మహోత్సవాల్లో భాగంగా బుధవారం చిత్తూరు, జీడీ నెల్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

9న ఐరాల మండల సమావేశం

ఐరాల, సెప్టెంబరు 4: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సీసీ కెమెరాలు తప్పనిసరి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 4: దుకాణ యజమానులు, దాబాల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం పోలీసుస్టేషన్ ఆవరణలో దుకాణదారులు, దాబాల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. వారంలోపు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 4: 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ కోరారు. బుధవారం బూత్ స్థాయి అధికారులు, బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువతను గుర్తించాలని సూచించారు. ఎంపీడీవో శివశంకర్, సీఐ శ్రీనివాసులు, డీటీ ఇబ్రహీం పాల్గొన్నారు.

యువమోర్చా మీడియా కన్వీనర్‌గా భాస్కర్

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 3: యువ మోర్చా మీడియా సెల్ జిల్లా కన్వీనర్‌గా ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట గ్రామానికి చెందిన పి.భాస్కర్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు నియమాక పత్రం అందజేశారు.

'సాయం చేయకపోగా విమర్శలా..?'

పెనుమూరు, సెప్టెంబరు 4: వైసీపీ నాయకులు విజయవాడలో వరద బాధితులకు సాయం చేయాల్సింది పోయి విమర్శలు చేయడం బాధాకరమని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజా పక్క రాష్ట్రంలో కూర్చుని పనికిమాలిన మాటలు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నిద్రాహారాలు మాని సహాయక చర్యలు చేస్తుంటే నోటికి వచ్చినట్టు వాగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుని ప్రజలకు కష్టం వస్తే కనీసం పలకరించడానికి రాకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు తెలపండి


సమస్యలు రాసుకుంటున్న ఏఈ తులసీప్రసాద్

పెనుమూరు, సెప్టెంబరు 4: విద్యుత్ సమస్యలను రైతులు, వినియోగదారులు తెలిపితే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ తులసీప్రసాద్ తెలిపారు. మండలంలోని ఉగ్రాణంపల్లి సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఆయన రైతులు, విద్యుత్ వినియోగదారులతో సమావేశమయ్యారు. మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సరఫరాలో అంతరాయం కలగకుండా పొలాల వద్ద విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు సహకరించాలని కోరారు.

వేరుశనగ సాగు వివరాల సేకరణ

వెదురుకుప్పం, సెప్టెంబరు 4: కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం వేరుశనగ పంట సాగు చేసిన రైతుల వివరాలను ఏవో హేమలత ఆధ్వర్యంలో ఉద్యోగులు వివరాలు సేకరించారు. ఏయే రైతు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న వివరాలు రాసుకున్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయండి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ కోరారు. బుధవారం బీజేపీ సభ్యత్వం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజుపురం మండలాధ్యక్షులు మురళి, జ్యోతిరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ పాల్గొన్నారు.

టీచర్లకు ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళా టీచర్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4: టీచర్స్ డేను పురస్కరించుకుని మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం గంగాధరనెల్లూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. రెండవ ఎంఈవో గుణశేఖరరెడ్డి ప్రారంభించారు. మహిళా టీచర్లకు మ్యూజికల్ చైర్స్, టీస్పూన్ పోటీలు, పురుష టీచర్లకు క్రికెట్, కబడ్డీ నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు పంపిణీ చేయనున్నారు.

కట్టమంచి చెరువులో జల పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 4: స్థానిక కట్టమంచి చెరువులో బుధవారం నగర వినాయక నిమజ్జన కమిటీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు వినాయక నిమజ్జన జల పూజలు చేశారు. చెరువులోని నీటిని ఆవు పంచగవ్యం, పవిత్ర గంగా జలంతో శుద్ధి చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు.

వినాయక చవితికి ఏర్పాట్లు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 4: వినాయక చవితిని పురస్కరించుకుని నగరంలోని మిట్టూరు సుందర వినాయక, బజారు వీధి శివ షణ్ముగ సుందర వినాయక, దుర్గా నగర్ కాలని సర్వసిద్ధి వినాయక, కట్టమంచి వినాయక ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. 75 దొడ్డిపల్లె, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్, రోసినగర్, మంగసముద్రం ఆలయాల్లోనూ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్ర పనులు



గుడిపాల, సెప్టెంబరు 4: మండలంలోని ఏఎల్ పురం పంచాయతీ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రం పనులు సగంలో ఆపేశారు. గత ప్రభుత్వంలో ఉన్న భవనాన్ని కూల్చేసి కొత్తగా నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. కిటికీలు, తలుపులు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడంతా మందులు తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

మేము సైతం..

- విజయవాడ వరద బాధితులకు విరాళాల వెల్లువ
- ముందుకు వస్తున్న దాతలు, స్వచ్ఛంద సంస్థలు



సరుకుల లారీని ప్రారంభిస్తున్న చెన్నకేశవులు నాయుడు - బియ్యం అందిస్తున్న కార్యదర్శులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 4: విజయవాడలో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పలువురు తమవంతు సాయం అందిస్తున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాతల నుంచి సేకరించిన రూ.30 లక్షల విలువచేసే నిత్యావసర సరుకులను పంపించారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం కార్యాలయం నుంచి బియ్యం, వంటనూనె, కూరగాయలు, వాటర్ బాటిళ్లు తదితరాలను లారీలో తరలించారు. జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు జెండా ఊపి లారీని పంపించారు. అలాగే దాతల నుంచి సేకరించిన రూ.10 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. కాగా, ఎమ్మెల్యే జగన్మోహన్ విజయవాడలో వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక ఉద్యోగులు

చిత్తూరు : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. నలుగురు పారిశుధ్య కార్యదర్శులు, నలుగురు మేస్త్రీలు, 63 మంది కార్మికులు మంగళవారం రాత్రి ప్రత్యేక బస్సులో విజయవాడకు వెళ్లారు. నూతన కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడలోని 16వ డివిజన్‌లో రామలింగేశ్వరకట్ట, పోలీసుకాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు.

పది బస్తాల బియ్యం వితరణ

చిత్తూరు నగరపాలక సంస్థ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు తమవంతు సాయంగా పది బస్తాల బియ్యాన్ని అందించారు. కార్యదర్శులందరూ కలిసి రూ.10వేలు విలువచేసే పది బస్తాల బియ్యాన్ని అందించారు.

డీఆర్‌డీఏ దాతృత్వం

చిత్తూరు (సెంట్రల్) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) మహిళా సమాఖ్య సభ్యులు రూ.10 వేల ఆహార పొట్లాలు, 10 వాటర్ బాటిల్స్, 20 వేల బిస్కెట్ ప్యాకెట్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. ఒంగోలులో ఏర్పాటు చేసిన శిబిరానికి ప్రత్యేక వాహనంలో పంపుతున్నట్లు చెప్పారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలకు నిరంతర విద్యుత్


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: కాణిపాక బ్రహ్మోత్సవాలకు అంతరాయం లేని విద్యుత్తే లక్ష్యంగా పని చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు కాణిపాకంలో ఓ అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వాట్సాప్ నంబరు ఏర్పాటు చేశామని, 9440814283కు సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కారం చేస్తామని తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ పొందాలంటే ఎంసీబీ పెట్టించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, కొండయ్య, సుబ్రమణ్యం, ఆనంద్, జయప్రకాష్ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి : జేసీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 4: మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జేసీ విద్యాధరి అన్నారు. మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతికి జై - పర్యావరణ రక్షణకు సై' అనే పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కృత్రిమ రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కాలుష్యమవుతున్నాయని అన్నారు. విగ్రహాల తయారీకి సహజ సిద్ధమైన రంగులను, ప్రకృతితో తయారయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, ఏఈ మదన్‌మోహన్ రెడ్డి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామాలయ కుంభాభిషేకం


కుంభాభిషేకంలో ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు 4 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీలపట్టు కోదండరామాలయ కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో వేద పండితులు శాస్త్రోక్తంగా కలశ పూజలు చేశారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు. కాగా, నగరి పట్టణంలో ఈనెల పదో తేదీన జరిగే జాతరకు హాజరుకావాలని జాతర కమిటీ సభ్యులు ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో..

విజయపురం : మండలంలోని పన్నూరు విఘ్నేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం కలశపూజ, యాగశాలపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్వామిని దర్శించుకున్నారు.

వర్షమొస్తే ఆ కాలనీలు జలమయమే


నీటిలో చిక్కుకున్న ఇందిరమ్మకాలనీ

నగరి, సెప్టెంబరు 4: వర్షం కురిస్తే చాలు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మకాలనీ పూర్తిగా జలమయమవుతుంది. నాలుగు వైపులా నీరు చేరి ద్వీపాన్ని తలపిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి చేరిన నీటి నుంచి బయటపడడానికి నాలుగు రోజులు పట్టింది. దేశమ్మ గుడి నుంచి ఇందిరమ్మ కాలనీకి వచ్చే ప్రధాన రహదారిలో వంతెన నిర్మాణం చేపడితే ఈ సమస్య నుంచి బయటపడవచ్చునని కాలనీవాసులు చెబుతున్నారు. నగరి నుంచి కీళపట్టుకు వెళ్లే మార్గంలో కుశస్థలీ నది వద్ద ప్రవాహం ఎక్కువైతే వాహనాలు సైతం వెళ్లడానికి వీలు కావడం లేదు. ఏటా కీళపట్టు వాసులకు ఈ తిప్పలు తప్పడం లేదు. వంతెన ఎత్తు పెంచితే ఈ సమస్యను పరిష్కరించవచ్చునని స్థానికులు చెబుతున్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు సక్రమం గా నిర్మించి, సిమెంటు రోడ్డు ఎత్తు పెంచినట్లయితే వరద నీటి సమస్యను అరికట్టవచ్చునని అంటున్నారు.

ఎన్‌టీఏ నగర నూతన కార్యవర్గం ఎన్నిక



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 4: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.దేవిక, ఎన్.రుక్మాంగదలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జయప్రకాష్ నాయుడు తెలిపారు. నగర నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక గాండ్లపల్లి నగర పాలక పాఠశాలలో జరిగింది. గౌరవాధ్యక్షురాలిగా వి.గీతాంజలి, కోశాధికారిగా ఎం.బాబు, సహాధ్యక్షులుగా జి.ప్రసూనకుమారి, జ్యోత్స్న, ఉపాధ్యక్షులుగా ఏ.శైలజ, ఏ.మౌనిక, ఎ.రంగనాయకమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసులు, శ్రీహరి, కార్యవర్గ సభ్యులుగా పి.గిరిజ, ఎస్.రాజశేఖర్, ఎం.ప్రతాప్ సింహాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి


పార్టీ సభ్యత్వం తీసుకుంటున్న నాయకులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 4: పార్టీకి సభ్యత్వం ఎంతో కీలకమని, దీనిపై నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు అన్నారు. జిల్లాలో బీజేపీ సభ్యత్వం కార్యక్రమాన్ని బుధవారం పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రమేష్ నాయుడు పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. పార్టీ సభ్యత్వంతో పాటు విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించాలన్నారు. అనంతరం పలువురు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

నేటి 'డయల్ యువర్ ఎమ్మెల్యే' రద్దు

చిత్తూరు, సెప్టెంబరు 4 : నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి గురువారమూ నిర్వహించే డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ఈ వారం చేసినట్లు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విజయవాడకు వెళ్లినందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ

వెదురుకుప్పం, సెప్టెంబరు 4: కార్వేటినగరం మండలం అన్నూరులో బుధవారం కేవీకే ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీలత వారికి అవగాహన కల్పించారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 4: మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని వెదురుకుప్పం ఏవో వనిత తెలిపారు. బుధవారం వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె, మొండి వెంగనపల్లెల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పరమేశ్వర రైతు సహకార సంఘం, రియల్ రైతు సహకార సంఘం సభ్యులు హాజరయ్యారు. సంఘంగా ఉండటం ద్వారా ప్రభుత్వ రాయితీలను పొందవచ్చునని వివరించారు.

మొక్కలను సంరక్షించాలి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4: మొక్కలు నాటి, సంరక్షిస్తే భావితరాలకు మెరుగైన వాతావరణం అందుతుందని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గంగాధరనెల్లూరు బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం ప్రిన్సిపాల్ దమయంతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పీడీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచి మొక్కలునాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. గురుకుల పాఠశాలల డీసీవో పద్మజ, డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4: గత ప్రభుత్వంలో మంజూరైన ఇంటి నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మండలంలోని ముసలయ్యగారిపల్లె లేఅవుట్‌లో బుధవారం ఆయన జిల్లా హౌసింగ్ ఈఈతో కలిసి ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. పూర్తికాని బేస్‌మెంట్, రూఫ్ లెవల్, మోల్డింగ్ లెవల్ కలిపి 1,053 ఇళ్లు ఉన్నాయని గుర్తించామన్నారు. అక్టోబరు లోపు నిర్మాణ పనులు పూర్తి చేసుకోకపోతే బిల్లులు రాదని పేర్కొన్నారు.

సంతకు పోతున్నారా..జర జాగ్రత్త


పెనుమూరు, సెప్టెంబరు 4: పెనుమూరులో ప్రతి బుధవారమూ నిర్వహించే సంతకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఇక్కడ దొంగలు ఎక్కువగా ఉన్నారు. సెల్‌ఫోన్లు, పర్సులు కొట్టేస్తున్నారు. గత బుధవారం దుకాణదారుడి సెల్‌ఫోన్‌ను కొట్టేశారు. పెనుమూరు స్టేట్‌బ్యాంకు ఉద్యోగి రోజూ తిరుపతి నుంచి వచ్చి పోతుంటాడు. బుధవారం సంత దగ్గర బస్సు ఎక్కే లోపు దొంగలు చేతివాటం చూపించి, సెల్‌ఫోన్ కొట్టేశారు. అదే రోజు సంతలో తన పర్స్ కొట్టేశారని, అందులో బంగారు చైన్ ఉందని ఓ మహిళ కన్నీరుపెట్టుకోవడం కనిపించింది. ఇప్పటికైనా పోలీసులు దొంగలపై ఓ కన్నేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ అవార్డుకు ఎంపిక


జ్యోతి - వరదయ్య

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 4: మండలానికి చెందిన ఇద్దరు టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో ఆంజినేయులుశెట్టి తెలిపారు. కొత్రకోన ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ వరదయ్య, కొత్త వెంకటాపురం ప్రాథమిక పాఠశాల టీచర్ జ్యోతి చిత్తూరులో గురువారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

జగన్‌కు ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదు


సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 4: మాజీ సీఎం జగన్‌కు ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు సీఎం చంద్రబాబు అండగా నిలుస్తుంటే జగన్ కనీసం ఒక పులిహోరా ప్యాకెట్ కూడా ఇవ్వకుండా ఫొటోల కోసం పులివేషాలు వేశారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే లండన్ టూర్‌కు వెళ్లిన బాధ్యత లేని నేత జగన్ అని విమర్శించారు. బురద రాజకీయాలు చేయడం జగన్‌కే తగిందన్నారు. మాజీ మంత్రి రోజా చెన్నైలో ఏసీ రూమ్‌లో కూర్చుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. నేతలు మోహన్‌రాజ్, సునీల్ చౌదరి, మధు యాదవ్, బాబు నాయుడు, జైపాల్ పాల్గొన్నారు.